ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



విశాఖపట్నం

జిల్లా వార్తలు

ఆదివారం 11 ఫిబ్రవరి 2024



నాగబాబు, వంశీకృష్ణ సమక్షంలో జనసేనలో చేరికలు

జనసేన, టీడీపీ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం

- కార్యకర్తలకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పిలుపు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10: జనసేన, తెలుగుదేశం పార్టీల ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా జన సైనికులు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. ఆయన శనివారం శివాజీపాలెంలో జనసేన నగర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు వ్యాపారులకు కండువాలు వేసి ఆహ్వానం పలికారు. అనంతరం నాగబాబు మాట్లాడుతూ వైసీపీ నాయకులకు దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. తమకు మాత్రం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమన్నారు. వైసీపీని గద్దె దింపాలంటే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకూడదన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయానికి జన సైనికులు శ్రమించాలన్నారు. సినీ నిర్మాత మద్దాల భాను, ప్రొఫెసర్ స్వర్ణలత, సుమన్, శ్రీనివాస్, రాజీవ్‌గౌడ్, కొండలరావు, సంతోష్‌కుమార్ తదితరులు జనసేన పార్టీలో చేరారు.



విమానాశ్రయంలో నారా లోకేశ్‌తో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

లోకేశ్‌కు ఘన స్వాగతం

- రోడ్డు మార్గాన ఇచ్ఛాపురానికి...
- నేడు 'శంఖారావం' ప్రారంభం
- 17 నుంచి జిల్లాలో పర్యటన

గోపాలపట్నం, ఫిబ్రవరి 10: ఉత్తరాంధ్రలో 'శంఖారావం' కార్యక్రమం ప్రారంభించేందుకు శనివారం నగరానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం ఆరున్నర గంటలకు విశాఖపట్నం చేరుకున్నారు. లోకేశ్‌కు ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పీగణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు ... మిగతా 4వ పేజీలో




నాయకులు, కార్యకర్తలకు నమస్కరిస్తున్న లోకేశ్

అవే తప్పులు... ఓటుకు తిప్పలు!

తప్పుల తడకగా ఓటర్ల జాబితాలు

డూప్లికేట్, మృతుల ఓట్లను తొలగించని అధికారులు

- ఒకే ఎపిక్ నంబరుపై రెండేసి ఓట్లు
- కొత్త దరఖాస్తులకు ఇప్పటికీ లభించని మోక్షం
- సచివాలయం దాటని బీఎల్‌వోలు
- అక్కడికి వస్తేనే పరిశీలిస్తామని ఫోన్లు
- బూత్‌కు 20 మందికి రెండేసి ఓట్లు!
- 'తూర్పు' ఎమ్మెల్యే వెలగపూడి కుటుంబసభ్యులకు వేర్వేరు బూత్‌లలో ఓట్లు



ఒక్కొక్కరికీ రెండేసి ఓట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు చేసిన ప్రకటనలు ఒట్టివేనని తేలిపోయింది. తుది ఓటరు జాబితాలోనూ భారీగా తప్పులు దొర్లడం యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మరీ విస్తృత ప్రచారం చేసిన అధికారులు మూడు నెలల కిందట చేసిన దరఖాస్తులకు ఇప్పటికీ పరిష్కారం చూపించలేదు.

విశాఖ తూర్పు నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున తప్పులు దొర్లాయి. ఒకే వ్యక్తికి రెండేసి ఓట్లు, ఒకే ఎపిక్ నంబరుపై రెండు ఓట్లు ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. మృతుల ఓట్లను తొలగించాలని దరఖాస్తు చేసుకున్నా తుది జాబితాలో ఉంచేశారు. అంతేకాదు ఒకే కుటుంబంలో గల వారికి వేర్వేరు బూత్‌లు కేటాయించారు. సాక్షాత్తూ విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉండగా, వారిలో నలుగురికి ఒక బూత్‌లో, ఒకరికి మరో బూత్‌లో ఓటు హక్కు కల్పించారు. కాగా చాలామంది మూడు నెలల క్రితమే కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ మోక్షం లభించలేదు.

ఈ నియోజకవర్గంలో సుమారు 28 వేల మంది కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు బూత్‌లెవెల్ అధికారులు వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించిన తరువాత ఓటు హక్కు కల్పించాలి. అయితే బూత్ లెవెల్ అధికారులు వార్డు సచివాలయాల్లోనే కూర్చుని దరఖాస్తుదారులకు ఫోన్ చేసి సచివాలయాలకు రావాలని సూచించారు. అక్కడికి వస్తేనే పరిశీలన చేస్తామని ... మిగతా 4వ పేజీలో

వైసీపీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అమర్

- టికెట్‌పై స్పష్టత కరవు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పార్టీ అధిష్ఠానం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం రీజనల్ కో-ఆర్డినేటర్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు. ఆయనకు సహాయకుడిగా అమర్‌నాథ్‌ను నియమించారు. అమర్‌నాథ్ ప్రస్తుతం అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడ ఆయన్ను తప్పించి మలసాల భరత్‌కుమార్‌ను సమన్వయకర్తగా పార్టీ నియమించింది. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలో మంత్రికి ఇంతవరకూ స్పష్టత ఇవ్వలేదు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్థానంలో అవకాశం ఇస్తారని అనుకున్నా...ఆ సూచనలు ఏమీ కనిపించడం లేదు. అనకాపల్లి ఎంపీగా పోటీకి దింపినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదని ఆయన అనుచరులు అంటున్నారు. జగన్ ఏమి చెబితే అది చేస్తానని అమర్‌నాథ్ అంటున్నారు. ఎన్నికల బరిలో ఉంటారా?, లేక పార్టీ సేవలకే పరిమితమవుతారా?...అనేది త్వరలో తేలిపోనుంది.



గుడివాడ అమర్‌నాథ్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- జిల్లాలో 150 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 37,927 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- సెలవు రోజు ప్రారంభంపై విద్యార్థుల అసహనం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10: జిల్లాలో ఆదివారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు మొదటి విడత 129 కేంద్రాల్లో, రెండో విడత 16 నుంచి 20వ తేదీ వరకు 102 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని ఆర్ఐవో మురళీధర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా సైన్స్ గ్రూపులకు చెందిన మొత్తం 37,927 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ విద్యార్థులు 32,982 మంది, బైపీసీ విద్యార్థులు 4,945 మంది ఉన్నారు.



ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్

సీసీ కెమెరాల పర్యవేక్షణలో...

పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 186 జూనియర్ కళాశాలలు ఉండగా, వీటిలో పూర్తిస్థాయి ల్యాబ్ సదుపాయాలున్న 150 కళాశాలలను కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలకు సంబంధించి పీతాపురం కాలనీలోని ఆర్ఐవో కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని 150 కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల లింక్‌ను కార్యాలయంలోని కాల్‌సెంటర్‌తో అనుసంధానం చేశారు. అధికారులు సీసీ కెమెరాల ద్వారా పరీక్షలను పర్యవేక్షిస్తారు. కాగా ఆదివారం సెలవు రోజున పరీక్షలు ప్రారంభిస్తుండడంపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పక్కాగా ఏర్పాట్లు

- పి.మురళీధర్, ఆర్ఐవో

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశాం. జిల్లాలో మొత్తం 150 కేంద్రాలను ఏర్పాటుచేశాం. అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తాం. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నాం.

కోరలు చాస్తున్న కేన్సర్

గత కొన్నాళ్ల నుంచి భారీగా కేసులు

- ఉత్తరాంధ్రలో ఏడాదికి 15,000-20,000 వరకూ నమోదు
- మహిళల్లో అధికంగా కనిపిస్తున్న రొమ్ము, సర్వైకల్ కేన్సర్లు
- పురుషుల్లో గొంతు, జీర్ణాశయ, లంగ్, ప్రొస్టేట్ కేన్సర్
- బాధితుల్లో 51 శాతం మంది మహిళలు, 49 శాతం పురుషులు
- ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలంటున్న వైద్యులు
- సకాలంలో గుర్తిస్తే చికిత్స తేలిక



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేన్సర్ మహమ్మారి కోరలు చాస్తోంది. ఏటా కేన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఏటా సుమారు 15 వేల నుంచి 20 వేల వరకూ కేన్సర్ కేసులు నమోదవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. పురుషులలో గొంతు, నోటి, జీర్ణాశయ కేన్సర్లు, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్లు అధికంగా కనిపిస్తున్నాయి.

ఏటా 15 వేల నుంచి 20 వేల కేసులు

పదేళ్ల కిందట నగరంలో రెండు, మూడు కేన్సర్ ఆస్పత్రులు ఉండగా, అప్పట్లో ప్రతిరోజూ 30 మంది వరకు వైద్యం కోసం వచ్చేవారు. ప్రస్తుతం 20 ఆస్పత్రుల్లో కేన్సర్ సేవలు అందుతున్నాయి. ప్రతిరోజూ ఆస్పత్రుల్లో కొత్తగా చేరే రోగుల సంఖ్య కనీసం 100 మంది వరకూ ఉంటోంది. దీనిని బట్టి కేన్సర్ రోగుల సంఖ్య ఏ స్థాయిలో పెరుగుతుందో ఇట్టే అర్థం చేసు కోవచ్చునని వైద్యులు చెబుతున్నారు. అయితే అధునాతన చికిత్సా విధానాల వల్ల చాలామంది వ్యాధి నుంచి కోలుకుంటున్నారంటున్నారు.

ఇవి అధికం..

ఉత్తరాంధ్ర ప్రాంతంలో అధికంగా పురుషుల్లో అయితే నోటి, లంగ్, జీర్ణాశయం, పెద్దపేగు, ప్రొస్టేట్ కేన్సర్లు అధికంగా ఉండగా, మహిళల్లో రొమ్ము, గర్భ సంచి ముఖద్వార, నోటి, అండాశయ, స్టమక్ కేన్సర్లు, చిన్నారుల్లో బ్రెయిన్, బ్లడ్ కేన్సర్లు కనిపిస్తున్నాయి. కేన్సర్ బారినపడుతున్న వారిలో 30 ఏళ్లలోపు యువకులు కూడా ఉంటున్నారు. ఖైనీ, గుట్కా, మద్యం వంటి అలవాట్లతో నోటి, లంగ్, లివర్ కేన్సర్ల బారినపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అధునాతన వైద్య పద్ధతులు

కేన్సర్‌ను ముందుగానే గుర్తించే అధునాతన పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. సకాలంలో గుర్తిస్తే అడ్వాన్స్‌డ్ వైద్య పద్ధతులతో రోగులు జీవించే కాలాన్ని పెంచగలుగు తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. గతంలో నాలుగో స్టేజీలోకి వచ్చిన రోగులు నాలుగు నెలలకు మించి బతకని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం నాలుగేళ్లకు పైబడి జీవించేలా చేస్తున్నామని చెబుతున్నారు. కేన్సర్ బారినపడుతున్న వారిలో 51 శాతం మంది ... మిగతా 4వ పేజీలో

వైసీపీ సమన్వయకర్తకు నలుగురు సెక్యూరిటీ!

- ఇష్టానుసారంగా అధికార దుర్వినియోగం
- మేయర్‌కు లేని సెక్యూరిటీ...కార్పొరేటర్‌కు ఎందుకో..?

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వింత పోకడలు ఎక్కువయ్యాయి. అధికార దుర్వినియోగం అధికమైంది. మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) మేయర్ గొలగాని హరికుమారికి ఎటువంటి భద్రత ఏర్పాట్లు లేవు. కానీ ఓ వార్డు (70)కు కార్పొరేటర్‌గా ఉన్న ఉరుకూటి రామచంద్రరావు (చందూ)కు ప్రభుత్వం తాజాగా నలుగురు (2+2) గన్‌మెన్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదేశాలు రాగానే అవి అమలులోకి కూడా వచ్చేశాయి. చందూకు బెదిరింపులు లేవు. శత్రువులు లేరు. రక్షణ కావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరలేదు. కానీ ఇచ్చారు. ఆయన గాజువాక నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త కావడమే దానికి ప్రధాన కారణం. వచ్చే ఎన్నికల్లో గాజువాక నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన బరిలో దిగుతారని, అందుకే రక్షణ కల్పించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇక్కడ విచిత్రం ఏమిటంటే...ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేగా ఉన్న తిప్పల నాగిరెడ్డికి 1+1 సెక్యూరిటీ మాత్రమే ఉంది. గతంలో మంత్రిగా చేసి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కూడా 1+1 సెక్యూరిటీయే ఉంది. వీరందరికీ ఇద్దరిని మాత్రమే ఇచ్చి చందూకి నలుగురిని ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అధికార పార్టీ నాయకులే అంటున్నారు.



సెక్యూరిటీ నడుమ గాజువాక వైసీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు

అభ్యర్థిత్వం ఖరారైననట్టేనా...

గాజువాక వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన చందూయే ఎమ్మెల్యే అభ్యర్థి అని ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుటుంబానికి ఈసారి టికెట్ ఇవ్వలేమని అధిష్ఠానం స్పష్టంచేసినా వారు ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. యాదవ సామాజిక వర్గమని చందూకి టికెట్ ఇచ్చినట్టయితే...ఆయన కంటే మేయర్ హరికుమారిని పోటీకి దింపాలని తిప్పల వర్గం ప్రతిపాదించింది. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం తాజాగా చందూకు సెక్యూరిటీని ఇవ్వడంతో ఆయనకే టికెట్ అనే విషయం పరోక్షంగా స్పష్టంచేసినట్టయింది.

హెచ్‌పీసీఎల్‌లో భారీ చోరీ

- రూ.4 కోట్ల విలువైన కాపర్ బండిల్స్ బయటకు తరలింపు
- సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నప్పుడు వెలుగు చూసిన వైనం
- నిందితుడికి సహకరించిన సంస్థకు చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్



మల్కాపురం, ఫిబ్రవరి 10: హెచ్‌పీసీఎల్‌లో సుమారు నాలుగు కోట్ల రూపాయల విలువైన కాపర్ బండిల్స్ చోరీకి గురైనట్టు అధికారులు గుర్తించారు. పదిహేను రోజులకొకసారి సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సీఐఎస్ఎఫ్, హెచ్‌పీసీఎల్ అధికారులు ఫుటేజీను పరిశీలిస్తుండగా కాపర్ బండిల్స్ చోరీకి గురైన విషయం వెలుగులోకి వచ్చింది. దీని గురించి అధికారులు సమగ్రంగా ఆరా తీశాక చోరీ జరిగినట్టు నిర్ధారించుకుని అదేరోజు అర్ధరాత్రి 12 గంటల సమయంలో మల్కాపురం ... మిగతా 4వ పేజీలో

'ఆడుదాం ఆంధ్ర'లో అరకొర సదుపాయాలు



నేలపై కూర్చున్న క్రీడాకారులు

మైదానాల్లో కుర్చీల కొరత... మట్టిలో కింద కూర్చున్న క్రీడాకారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో 'ఆడుదాం... ఆంధ్ర' ఫైనల్స్ నిర్వహిస్తున్న మైదానాల్లో సదుపాయాలు అరకొరగా ఉన్నాయి. దీంతో శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ మైదానం, జిమ్నాజియం స్టేడియం వద్ద క్రీడాకారులు ఇబ్బందిపడ్డారు. బాస్కెట్‌బాల్ మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ రెండు జట్లు తలపడుతున్న సమయంలో సరిపడా కుర్చీలు లేకపోవడంతో మిగిలిన జట్ల క్రీడాకారులు మట్టిలో కిందనే కూర్చోవాల్సి వచ్చింది. ఎండ తీవ్రతకు కొందరు సొమ్మసిల్లిపో యారు. జిమ్నాజియం మైదానంలో కూడా అదే పరిస్థితి. టెంట్లు ఏర్పాటుచేయకపోవడంతో మధ్యాహ్న సమయంలో కొందరు క్రీడాకారులు చెట్ల నీడను ... మిగతా 4వ పేజీలో

నేడు భక్తి గీతాలాపన

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10: రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఆది వారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12వరకు గానసుధ గల్లా చిట్టిబాబు బృందంతో భక్తి గీతాలపన కార్యక్రమం ఉంటుందనిఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు.

జనసేనలోకి వైసీపీ నేత

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10: జనసేన పార్టీలోకి జీవీఎంసీ పరిధి 31వ వైసీపీ వార్డు మాజీ అధ్యక్షులు మొకర గోపి చేరారు. శనివారం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనియాస్‌యాదవ్ సమక్షంలోపార్టీలోకి చేరారు.

నేడు దుర్గా మహిళా సంఘ సమావేశం

అక్కయ్యపాలెం: దుర్గా మహిళా సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం ఆదివారం సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న తోటలో జరగనున్నట్టు సంఘ అధ్యక్షురాలు బి.వేళాంగిణి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఖర్చు, జమ కు లెక్కలు, సభ్యుల సంక్షేమం అంశాలను చర్చిస్తారు.

16న సమ్మె విజయవంతం చేయాలి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10: దేశ వ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించనున్న సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశంలో ఆయన మాట్లాడారు.

పూర్ణా మార్కెట్‌లో అక్రమంగా ఆశీల వసూలు

» చిరు వ్యాపారులు గగ్గోలు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 10:వన్‌టౌన్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ (పూర్ణామార్కెట్)లో ఆశీలు కాంట్రాక్టర్ అక్రమ వసూళ్లు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీంతో చిరువ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వన్‌టౌన్ పోలీసులు రోడ్డుపై వ్యాపారాలను తొలగించారు. మార్కెట్ ఎదుట పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఆటువైపు వ్యాపారాలను పోలీసులు పూర్తి నియంత్రించారు. దీంతో ఆశీలు కాంట్రాక్టర్ మార్కెట్ ప్రధాన గేటు వైపు రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వారి నుంచి అధికంగా ఆశీలు వసూలు చేస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. అలాగే, పోలీసులు నియంత్రించిన రోడ్డుపైన రాత్రి ఏడు గంటల తర్వాత వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కాంట్రాక్టర్ వీరి నుంచి కూడా ఆశీలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. రోడ్డుమీద వ్యాపారంచేసే వారినుంచి రూ. 30 చెల్లించాల్సి ఉంటే.. రూ. 200 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఆశీలు చెల్లించమని నిరాకరిస్తే... కాంట్రాక్టర్ నియమించిన సిబ్బంది వ్యాపారాలను చిందవందర చేస్తున్నారని వాపోతున్నారు. ఓ రకంగా పోలీసులు రోడ్డుమీద వ్యాపారాలు తొలగించడం కాంట్రాక్టర్ అక్రమవసూళ్లకు వెసులుబాటుగా మారిందని వర్తకసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇక్కడ అక్రమ ఆశీలు వసూలు వ్యవహారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్‌అండదండలతోనే సాగుతుందని సీపీఎం నేతలు గతంలో బహిరంగ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు స్థానిక కార్పొరేటర్ విల్లూరిభాస్కరరావు ఫిర్యాదు చేయడంతో వారు స్పందించి ఆశీలు కాంట్రాక్టర్ గత డిసెంబరులో రద్దు చేశారు.తర్వాత జీవీఎంసీ, సచివాలయ ఉద్యోగులు ఆశీలు వసూలు చేశారు. దీంతో అడ్డగోలు వసూళ్లకు బ్రేక్ పడినట్లయింది. జనవరిలో కాంట్రాక్టర్‌కు జోనల్ అధికారులు తిరిగి ఆశీలు వసూలుకు అవకావం కల్పించారు. ఈ స్థితిలో కాంట్రాక్టర్ సంక్రాంతి రోజుల్లో భారీగా దోపిడీకి పాల్పడినట్టు విమర్శలు వచ్చాయి. ట్రాఫిక్ పోలీసులు మరోమారు ఆక్రమణల పేరిట దుకాణాలు తొలగించడంతో మళ్లీ కాంట్రాక్టర్‌కు కలిసివచ్చినయింది. కొంతమంది అధికారులుకాంట్రాక్టర్‌తో కుమ్మక్కై పీడిస్తుండడంతో చిరువ్యాపారులుగగ్గోలు పెడుతున్నారు. రోడ్డుపై వ్యాపారాలనునిరోధించాలనిలోన అధికారంగా వ్యాపారాలుసాగిస్తున్నవర్తకులు కోరుతున్నారు. అక్రమ ఆశీలు వసూళ్లను నిరోధించాలని పలువురు వేడుకుంటున్నారు.



పూర్ణా మార్కెట్ ఎదుట వ్యాపారులు

లోకేశ్ పర్యటనతో జగన్ పాలనకు చరమగీతం

» టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ



మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి నారా లోకేశ్ ఆదివారం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపు రం నుంచి ప్రారంభించనున్న శంఖా రావంతో సీఎం జగన్మోహనరెడ్డి పాలనకు చరమ గీతం తథ్యమని ఆ పార్టీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. లోకేశ్ రాష్ట్రంలో యువగళంపేరిట 3,200 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తిచేశారన్నారు. ఈ పాదయాత్రలో పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరిట ఆది వారం నుంచి ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు.రోజుకు మూడు నియోజ కవర్గాల చొప్పున పర్యటిస్తారన్నారు.ఈనెల 17న యాత్ర విశాఖకు చేరుకుంటుందని వివరించారు. విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

సజ్జలతో అక్కరమాని దంపతుల భేటీ!

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 10: వీఎంఆర్‌డీఏ పూర్వ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల దంపతులు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త బాధ్యతలను అక్కరమానిని తప్పించి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను నియమించడంతో కొంతకాలంగా విజయనిర్మల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల తగరపువలసలో జరిగిన ముఖ్యమంత్రి జగన్ సభకు కూడా హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం పిలుపుతో అమరావతికి వెళ్లిన దంపతులతో సజ్జల మాట్లాడినట్టు సమాచారం. పార్టీలో సముచిత ప్రాధాన్యం లభిస్తుందని, తొందపాటు నిర్ణయాలు తీసుకోవద్దని వారికినచ్చచెప్పారని, త్వరలో సీఎం జగన్‌తో సమావేశం ఏర్పాటుచేస్తానని హామీ కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. దీంతో అక్కరమాని మళ్లీక్రియాశీలకంగా వ్యవహరిస్తారని తూర్పునేతలు భావిస్తున్నారు.

నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హౌస్ అరెస్ట్



ప్లకార్డు ప్రదర్శిస్తున్న హేమంతకుమార్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడికి నిరుద్యోగులు పిలుపునివ్వడంతో ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్‌ను శనివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఆయన ఇంట్లో ముందస్తుగా నిర్బంధించారు. ఈసందర్భంగా హేమంతకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 23 వేల ఉద్యోగాలతో డీఎస్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్రెంటిస్ విధానం గత 12 ఏళ్ల క్రితం రద్దయినా దాన్ని మళ్లీ అమలు చేయడం అన్యాయమని చెప్పారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ వయోపరిమితి జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్లకు పెంచాలన్నారు. మూగ, చెవిటి అభ్యర్థులకు స్పెషల్ డీఎస్సీ ద్వారా పోస్టులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం ఖాళీలు 26వేల ఉద్యోగాలతో నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉందని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సచివాలయానికి ఒక డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి 15వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

వలంటైన్స్ డేను బహిష్కరించాలి: జన జాగరణ సమితి



పోస్టర్లు ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 10: ఈ నెల 14న వలంటైన్స్ డేను బహిష్కరించాలని కోరుతూ ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్సు ఎదుటనున్న ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ విద్యార్థులకు జన జాగరణ సమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ తాము స్వచ్ఛమైన ప్రేమికులకు, ప్రేమ పెళ్లిళ్లకు వ్యతిరేకం కాదని, ప్రేమికుల రోజు పేరుతో జరిగే విచ్చలవిడితనానికి, అమ్మాయిలపై జరిగే హింస, మత్తు పదార్థాల వినియోగానికి పూర్తిగా వ్యతిరేకమన్నారు. యువత స్వచ్ఛందంగా ప్రేమికుల రోజును బహిష్కరించి దేశ సంస్కృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, సామాజిక కార్యకర్త శ్రీహరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



కల్యాణోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, ఫిబ్రవరి 10: స్థానిక టీపీటీ కాలనీలోని ద్రావిడ సంక్షేమ లలిత కళ్యాణ మండపంలో శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటే శ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు వేదమంత్రాలమధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. గురూజీ కేపీ రాజు, ఆచార్య జీఎస్ఎన్ రాజు, వంకాయల సన్యాసి రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ద్వారం మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ ద్వారం త్యాగరాజు బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. శృతిలయ సంస్థ వ్యవస్థాకులు వి.ప్రభాకర్, ఎంవి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

'పత్రికలు వాస్తవాలను ప్రతిబింబింపచేయాలి'



మాట్లాడుతున్న ఏపీ జర్నలిజం కాలేజీ డైరెక్టర్ సతీష్ చందర్

సీతంపేట, ఫిబ్రవరి 10: పత్రికలు వాస్తవాలను వక్రీకరిస్తూ నిజాన్ని మరుగున పడేటట్లు చేస్తున్నాయని ప్రముఖ రచయిత, కవి, ఏపీ జర్నలిజం కాలేజీ డైరెక్టర్ సతీష్ చందర్ అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలోమీడియా- సామాజిక న్యాయం' అనే అంశంపై సదస్సును శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సతీష్ చందర్ మాట్లాడుతూ అంబేద్కర్ సాధించిన విజయాలను ఆనాటి పత్రికలు పరాజయాలుగా చూపించాయన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతన్న అనేక అకృత్యాలు ప్రస్తుతం మీడియాలో కానరావట్లేదన్నారు. స్వాతంత్ర పోరాటంలో భాగంగా దళితులను చైతన్యవంతం చేసేందుకుఅంబేద్కర్‌పత్రికను స్థాపించారన్నారు.ఏయూ జర్నలిజం విభాగం పూర్వ విభాధిపతి ప్రొఫెసర్ పి.బాబీవర్ధన్ మాట్లాడుతూ ప్రజలను జాగృతం చేయడానికి అంబేడ్కర్ చదవని అంశం లేదన్నారు.లీడర్ సంపాదకులు వీవీ రమణమూర్తి, అంబేడ్కర్ మెమోరియాల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, సొసైటీ కార్యదర్శి జె.వి. ప్రభాకర్, జర్నలిస్టు జేకేడీ ప్రసాద్, ఏయూప్రొఫెసర్ పీడీ సత్యపాల్, డాక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ ప్రజ్ఞ ఉన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి



విజేతలకు సర్టిఫికెట్స్ ఇస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10: విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని స్థిత ప్రజ్ఞ ఎండీ వైవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ఎంజీఎం స్కూల్‌లో స్థితప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయాలను ఏర్పచుకుని వాటిని సాధనకుకృషి చేయాలన్నారు. హెచ్ నాగభూషణం, సభ్యులు వై.ప్రదీప్, దుర్గాబాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై కళాజాత

సీతమ్మధార, ఫిబ్రవరి 10: పరిసరాల పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని జీవీఎంసీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ కిషోర్ అన్నారు. సీతమ్మధారలో పలు ప్రాంతాల్లో జీవీఎంసీ ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తదితర వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైకే రాజు కళాబృందం వీధి నాటిక, జానపద గీతాలతో పారిశుధ్య ప్రాధాన్యంపై అవగాహనకల్పించారు.

నేడు కాళింగుల ఆత్మీయ సమ్మేళనం

మాధవధార, ఫిబ్రవరి 10 ; మాధవధార ఉడాకాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం కాళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఖారవేల్ ఎడ్యుకేషనల్, కల్చరల్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పేడాడ.నరసింగరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి సామాజిక వర్గ ప్రముఖులు హాజరవుతాన్నారు. రానున్న ఎన్నికల్లో తమ సామాజిక వర్గ అభ్యర్థులను పార్టీలక తీతంగా మద్దతునిచ్చి గెలుపొందేలా చూడాలని, ఐక్యత ప్రధాన ఎజెండాగా సభ నిర్వహిస్తున్నామన్నారు.

41వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జ్ఞానాపురం, ఫిబ్రవరి 10: జీవీఎంసీ 41వ వార్డులో జ్ఞానాపురం, కాన్వెంట్ కూడలి, సుబ్బలక్ష్మీ నగర్‌లో సుమారు రూ.1. 92 కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులకు శనివారంవార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూరి మతో కలిసి స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్ శంకుస్థాపన చేశారు. వార్డు నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ, డీఈ భరణీ, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

లోకేశ్‌కు ఘన స్వాగతం

... 3వ పేజీ తరువాయి

పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రులు బండారు సత్యనారాయణమూర్తి, కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, గండి బాబ్జీ, వంగలపూడి అనిత, నేతలు కోరాడ రాజబాబు, మహ్మద్ నజీర్, పాశర్ల ప్రసాద్, రెడ్డి నారాయణరావు, పుచ్చా విజయకుమార్, పీఎస్ నాయుడు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈనెల17వ తేదీ నుంచి విశాఖ జిల్లాలో చేపట్టనున్న శంఖారావం యాత్రపై నాయకులతో లోకేశ్ ముచ్చటించారు. అనంతరం రోడ్డు మార్గంలో శ్రీకాకుళంజిల్లాఇచ్ఛాపురంబయలుదేరివెళ్లారు.ఆదివారం'శంఖారావం' ప్రారం భించనున్నారు.

విశాఖ జిల్లాలో 17 నుంచి పర్యటన: శంఖారావం యాత్రలో భాగంగా నారా లోకేశ్ ఈనెల 17వ తేదీ నుంచి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. 17వ తేదీ సాయంత్రం భీమిలి నియోజకవర్గంలో సభ, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. 18వ తేదీ ఉదయం విశాఖ తూర్పు, మధ్యాహ్నం దక్షిణ, రాత్రికి ఉత్తర నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. కార్యకర్తలతో సమావేశాలు, బహిరంగ సభలు ఉంటాయనిపార్టీ వర్గాలు తెలిపాయి. 19వ తేదీన విశాఖ పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల్లో పర్యటించిన అనంతరం అనకాపల్లి జిల్లాకు వెళతారు.

అవే తప్పులు... ఓటుకు తిప్పలు!

... 3వ పేజీ తరువాయి

సూచించడంతో పలువురు ఆసక్తి చూపలేదనే ఫిర్యాదులు ఉన్నాయి.

'తూర్పు'లో తప్పులు...

పాత డెయిరీ ఫారం ప్రాంతంలో ఇంటి నంబరు 5-608/ 26లో నివాసం ఉంటున్న రవికుమార్ ముక్కాలకు ఒకే ఎపిక్ నంబరు ఆర్‌వైజెడ్ 0277251తో బూత్ నంబరు 67 (సీరియల్ నంబరు 1435), 70 (సీరియల్ నంబరు 618)లో ఓట్లు ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతంలో ఇంటి నంబరు 16-688లో నివసిస్తున్న కొండపల్లి రాజేష్‌కు ఎపిక్ నంబరు ఏసీకే 9512022తో బూత్ నంబరు 10లో (సీరియల్ నంబరు 781), బూత్ నంబరు 12లో (సీరియల్ నంబరు 532)లో ఓట్లు ఉన్నాయి. ఆరిలోవ ఇంటి నంబరు 16-688లో ఉంటున్న గౌరీ స్వరాజ్‌కు ఎపిక్ నంబర్ ఐడీఎస్ 0097600తో బూత్ నంబరు నాలుగులో (సీరియల్ నంబరు 599), బూత్ నంబరు 12లో (సీరియల్ నంబరు 544)లో ఓట్లు ఉన్నాయి.

» కొత్తగా ఓటు కోసం సుజితగుప్త గత ఏడాది అక్టోబరు 25న, సూర్యవసంత నవంబరు 16న దరఖాస్తు చేసుకోగా, ఆన్‌లైన్‌లో ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నట్టు చూపిస్తోంది. నిబంధనల మేరకు రెండు వారాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఓటు హక్కు కల్పించాలి. కానీ ఇంతవరకూ ఎలాంటి చర్యలు లేవు.

» ఈస్టుపాయింట్ కాలనీ ఇంటి నంబరు 6-15-24లో ఉంటున్న అబ్దుల్ నిజాముద్దీన్‌కు బూత్ నంబరు 172లో ఓటర్ల జాబితాలో వరుస సంఖ్య 422 (ఎపిక్ నంబరు-ఐడీవై 2844488), వరుస సంఖ్య 691 (ఎపిక్ నంబరు -ఐడీవై 2972008)తో రెండు ఓట్లు ఉన్నాయి. దీంతో ఆయన ఒక ఓటును తొలగించాలని దరఖాస్తు చేయగా రెండు ఓట్లనూ తొలగించేశారు.

» తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎంవీపీ కాలనీ సెక్టార్-5లో నివాసముంటున్నారు. ఆయన ఇంట్లో ఎమ్మెల్యే, సతీమణి, ఇద్దరు కుమారులు, కోడలు ఉంటున్నారు. కాగా ఎమ్మెల్యే కోడలుకు సెవెన్త్‌డే స్కూలులో ఉన్న బూత్, మిగిలిన నలుగురికి గిరిజన భవన్ బూత్‌లో ఓటు హక్కు కల్పించారు.

» ఆరిలోవకు చెందిన బుగత తాతారావు కుటుంబంలో ముగ్గురికి ఓట్లు ఉన్నాయి. తాతారావు ఓటు రవీంద్రనగర్ ఎంపీఈపీ స్కూలులో ఉన్న బూత్ నంబరు 65లో, భార్య నారాయణమ్మ ఓటు అదే ప్రాంగణంలోని బూత్ నంబరు 68, కుమార్తె మౌనిక ఓటు ఎస్‌ఐజీ నగర్‌లోని బూత్‌నంబరు 70లో ఉన్నాయి.

గత నెల 22న విడుదల చేసిన తుది జాబితాలో చాలా మృతుల ఓట్లను ఉంచేశారు. ఎపిక్ నంబరు ఐడీవై 2521193తో ఇంటి నంబరు 18-443లోని పైడితల్లి మృతిచెందినా జాబితాలో తొలగించలేదు.

రెండు, అంతకంటే ఎక్కువ ఓట్లు...

ఇంటి నంబరు 7-24లో ఉంటున్న గుడిపాటి శ్రావణికి మూడు ఓట్లు ఉన్నాయి. అలాగే ఇంటి నంబరు 19-210/2లోని ఫ్లాట్ నంబరు 54లో ఉన్న వంక ధనశ్రీకి రెండు, డోర్ నంబరు 19-182/11లో ఉన్న పిల్లా కనకరాజుకు రెండు ఓట్లు ఉన్నాయి. ప్రతి బూత్‌లో కనీసం 10 నుంచి 20 మందికి రెండేసి ఓట్లు ఉన్నాయి. ముసాయిదా జాబితాలో డబుల్ ఎంట్రీలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకుండా తుది జాబితాలోనూ వాటిని యధాతథంగా ఉంచారు.

చట్ట సభల్లో బహుజనుల గళం అవసరం



సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ ప్రతినిధులు

మహారాణిపేట, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో బహుజన కులాల పాలన రావాలంటే చట్ట సభల్లో వారి గళం వినిపించాలని బీఎస్పీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పెదపెంకి శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రానున్న ఎన్నికల్లో పోటీచేయనున్న విశాఖ జిల్లా ఎమ్మెల్యే అభ్యర్థులతో కలసి పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వెనుకబడిన కులాల రాజ్యాధికారం కోసం కాన్షీరామ్ పార్టీ స్థాపించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రానున్న ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. తిరుపతిరావు , ఎస్.కోట ఇన్‌చార్జి బోని కృష్ణ, కదిరి రాము, పి కనకమహాలక్ష్మి, రమేష్ రామచంద్రరావు, ధనుంజయ్, రమణ పాల్గొన్నారు.

సత్యసాయినగర్‌లో చెత్త తొలగింపు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10: గ్రేటర్ 45వ వార్డు కొండవాలు ప్రాంత సత్యసాయినగర్‌లో పేరుకున్న చెత్తను ఎట్టకేలకు పారిశుధ్య కార్మికులు శనివారం తొలగించారు. ఈ ప్రాంతంలో సుమారుగా 500 మంది నివశిస్తున్నారు. పరిసరాల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు ప్రబలుతున్నాయి. అలాగే కొండప్రాంతం కావడం వల్ల పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయి. ఈ విషయాన్ని భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ దృష్టికి తీసుకొని వెళ్ళినట్లు స్థానికులు చెబుతున్నారు. వారు స్పందించి జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణతో చర్చించి పారిశుధ్య సిబ్బందతో చెత్తను తొలగించే చర్యలు చేపట్టారు. సింహాచలం దేవస్థానం సిబ్బంది వచ్చి పరిశీలించారు.

హెచ్‌పీసీఎల్‌లో భారీ చోరీ

... 3వ పేజీ తరువాయి

క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌పీసీఎల్ చరిత్రలో జరిగిన అతి భారీ చోరీ ఇదే. దీని వెనుక సంస్థకు చెందిన ఓ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉండడం గమనార్హం. చమురు శుద్ధి యూనిట్లలో ఉష్ణోగ్రతల నమోదు సమయంలో ఈ కాపర్‌ను వినియోగిస్తుంటారు. ఇటీవలే ఇతర ప్రాంతాల నుంచి కాపర్‌ను తెచ్చి సంబంధిత యూనిట్‌లో బిగించారు. మిగిలిన బండిల్స్‌ను తిరిగి హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి అప్పగించాల్సి ఉంది. అయితే ఈ పనిని ఒప్పుకున్న జయలక్ష్మి ఇంజనీరింగ్ సంస్థ యజమాని బంధువు ఒకరు గత నెల 28న ఓ వ్యాన్‌లో ఆ కాపర్ బండిల్స్‌ను బయటకు తరలించారు. శుక్రవారం సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తుండగా కాపర్ బండిల్స్‌ను వ్యాన్‌లో బయటకు పంపేసిన దృశ్యాలు చూసి అధికారులు ఖంగుతిన్నారు. దీనిపై అధికారులు ఆరా తీయగా హెచ్‌పీసీఎల్‌లోకి ప్రవేశించేందుకు నకిలీ పాస్‌ను తయారుచేసి, దాని ద్వారా ఆ వ్యక్తి లోపలకు ప్రవేశించి చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఈ పాస్ తయారీకి, కాపర్ బండిల్స్ బయటకు పోవడానికి సంస్థకు చెందిన ఓ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ సహకరించినట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఇది భారీ చోరీ కావడంతో ఫిర్యాదు అందిన శుక్రవారం అర్ధరాత్రి నుంచే పోలీసులు విచారణ ప్రారంభించారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు, హెచ్‌పీసీఎల్ అధికారులు శనివారం వేకువజాము నాలుగు గంటల సమయంలో మళ్లీ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణను వేగవంతం చేయవలసిందిగా కోరారు. కాగా ఈ కేసు లా అండ్ ఆర్డర్‌కు పరిధిలోకి వస్తుందా లేదా క్రైమ్ విభాగానికి వస్తుందా అని పోలీసు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. నకిలీ పాస్ తయారుచేసి చోరీకి పాల్పడినందున ఈ కేసును లా అండ్ ఆర్డర్ పోలీసులే దర్యాప్తు చేయాల్సి ఉంటుందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. దొంగతనం జరిగింది కాబట్టి క్రైమ్ విభాగం పోలీసులే దర్యాప్తు చేయాలని మరికొందరు పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి ఈ కేసును లా అండ్ ఆర్డర్ పోలీసులే దర్యాప్తు చేస్తున్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో అరకొర సదుపాయాలు

... 3వ పేజీ తరువాయి

ఆశ్రయించారు.

కడప క్రీడాకారిణికి గాయం

ఏయూలో కడప, చిత్తూరు జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలలో కడప జట్టు క్రీడాకారిణి మోటూరి భారతి తలకు తీవ్ర గాయమైంది. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఇరు జట్లు తలపడినప్పుడు చిత్తూరు జిల్లా నుంచి రైడ్(కూత)కు వచ్చిన రైడర్‌ను ఆపే ప్రయత్నంలో భారతి గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు అశోక్‌కుమార్ తెలిపారు. శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ కేజీహెచ్‌కు వెళ్లి క్రీడాకారిణిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

సింహగిరి కాలనీలో దొంగల హల్‌చల్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10:సింహగిరి కాలనీలో దొంగలు రెచ్చిపోయి అందినకాడికి దోచేస్తున్నారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలులేక దొంగల పని సులువవుతోంది. శుక్రవారం రాత్రి పార్కింగ్ చేసిన మూడు ఆటోలకుచెందిన నాలుగు టైర్లను విప్పి ఆగంతకులు పట్టుకుపోయారు. శనివారం ఉదయం గుర్తించిన యజమానులు అనసూరి పెంటారావు, నర్సింగ్, లక్ష్మణ రావు లబోదిబోమంటున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోరలు చాస్తున్న కేన్సర్

... 3వ పేజీ తరువాయి

మహిళలు ఉంటుండగా, పురుషులు 49 శాతం మంది ఉంటున్నారు. చిన్నారుల్లో వచ్చే కేన్సర్లు ఒక శాతం కంటే తక్కువ ఉంటున్నాయి. రోబోటిక్ సర్జరీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, రేడియో థెరపీ, అడాప్టివ్ రేడియో థెరపీ, ఇమ్యునో థెరపీ వంటి అధునాతన వైద్య పద్ధతులతో రోగులు జీవన ప్రమాణాన్ని పెంచడంతో పూర్తిగా కోలుకునేలా కూడా చేస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అవగాహన అవసరం: పొగాకు ఉత్పత్తుల వినియోగం, మద్యం అలవాటుకు దూరంగా ఉండడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, బరువు అదుపులో ఉంచుకోవడం, కొన్నిరకాల వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల కేన్సర్ బారినపడ కుండా ఉండవచ్చు. పురుషుల్లో వస్తున్న కేన్సర్లకు పొగాకు, మద్యపానం అలవాట్లు 90 శాతం కారణం అవుతుండగా, మహిళల్లో జన్యుపరమైన అంశాలు, లైంగిక సంబంధాలు, కొన్నిరకాల వైరస్‌ల వల్ల రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్లు అధికంగా వస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. మహిళలు రొమ్ము పరీక్ష చేయించుకోవడంతో పాటు 25 ఏళ్లు దాటిన వాళ్లంతా పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవడం వల్ల గర్భాశయ కేన్సర్‌ను సకాలంలో గుర్తించేందుకు అవకాశముంది. తొమ్మిది నుంచి 13 ఏళ్లలోపు బాలికలకు గర్భాశయ కేన్సర్ రాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

కేజీహెచ్‌లో ఉచితంగా పరీక్షలు: కేజీహెచ్‌లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్లను నిర్ధారించే పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. రొమ్ము కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నెలకు 150 వరకు చేస్తుండగా, గర్భాశయ ముఖద్వార కేన్సర్ నిర్ధారణ పరీక్షలు 400 వరకు చేస్తున్నారు. అయితే లక్షణాలను బట్టి వైద్యులే ఈ పరీక్షలు చేయించు కోవాలని సూచిస్తున్నారు తప్ప.స్వతహాగా పరీక్షలు చేయించుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వైద్యులు చెబుతున్నారు.

మహిళలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించవద్దు

- డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, గైనకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

కేన్సర్ పట్ల మహిళలు అవగాహనతో ఉండాలి. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని సకాలంలో గుర్తించేందుకు అవకాశం ఉంది. కేజీహెచ్‌లో రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కేన్సర్ పరీక్ష అంటేనే చాలామంది భయపడుతున్నారు. పరీక్షలు చేయించుకోవడం వల్ల వచ్చే ఇబ్బందులు ఏమీ ఉండవన్న విషయాన్ని గుర్తించుకోవాలి.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి, తదితరులు

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి

ఆటోనగర్, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. 70వ వార్డు పరిధి ఎల్బీనగర్‌లోని ద్రోణంరాజు కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన వికసిత భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాతృవందనం పథకం, ముద్ర లోన్లు, స్వనిధి లోన్లు, తదితర పథకాల గురించి తెరపై చూపిస్తూ వివరించారు. కేంద్ర పథకాలను తమవిగా వైసీపీ ప్రచారం చేసుకోవడం తగదన్నారు. బీజేపీ నాయకుడు దీనంకొండ కృష్ణంరాజు, జీవీఎంసీ అధికారులు కమలకుమారి, కృష్ణ, శ్రీనివాస్, రోహిణి, పావని, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 10: జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లో శనివారం వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామాలతో అర్చనలు, లక్ష్మీగణపతి హెూమాన్ని జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం పలువురు మహిళలు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

19న ప్రసన్నగిరి ప్రదక్షణ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 10: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరి గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానం వార్షికోత్సవాలు ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. శనివారం ఆలయంలోని శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశాక వార్షికోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను పాలక మండలి సభ్యులు ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రసన్నగిరి ప్రదక్షణ ఆ రోజు ఉదయం ఆరు గంటలకు ప్రారంభిస్తామన్నారు. భీష్మ ఏకాదశి సందర్భంగా 20న వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108 కలశాలతో క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం శ్రీనివాస కల్యాణం జరుతామన్నారు. 21న సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గాజువాక, ఫిబ్రవరి 10: పారిశుధ్య కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని 76వ వార్డు కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వార్డులో జరిగిన సమావేశంలో పారిశుధ్య కమిటీ నాయకులు మాట్లాడుతూ సమ్మె కాలపు జీతాలను తక్షణమే చెల్లించాలని, కార్మికుల ప్రధాన సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కా నాగరాజు, అప్పారావు, రాంబాబు, రంజాన్, తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ సక్సెస్‌పై సదస్సు

పెందుర్తి, ఫిబ్రవరి 10: వృద్ధి, పురోగతి సాధనతోనే ప్రగతి సాధ్యమని మెల్‌బోర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాక్వెల్‌ష్రాఫ్ అన్నారు. రోటరీ ఇండియా లిటరసీ మిషన్, జీఈఎస్ ఆధ్వర్యంలో మొబిలిటీ అండ్ కెరీర్ సక్సెస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కోర్సు డైరెక్టర్ డాక్టర్ కాలేషా బేగం సౌజన్యంతో శనివారం పెందుర్తి ఉన్నత పాఠశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాక్వెల్ ష్రాఫ్ మాట్లాడుతూ భౌతిక స్వాధీనాన్ని పెంచుకోవడమే ఎదుగుదల అని, దీనికి నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, నిబంధన సహకరిస్తే ప్రగతి సాధ్యమన్నారు.

బ్యూటీషియన్, ఫుడ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 10: హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ సంయుక్తంగా నిరుద్యోగులకు బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, టెన్త్ ఉత్తీర్ణులైన 18 నుంచి 28 ఏళ్లలోపు యువతీ యువకులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు 9121999654 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సినిమా గైడ్

- **ఈగెల్ :** జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శరత్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఈగెల్ :** మెలోడి, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం),
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** సంగం, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 18, టమాటా 24, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 24, క్యారెట్ 22, దొండకాయలు 34, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 70, బరబాటి 26, ముల్లంగి 14, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 32 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, క్యాప్సికమ్ 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	117
ఫారం ధర	--	137
విత్ స్కిన్	--	244
స్కిన్‌లెస్	--	254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..



కాలువ లేక రహదారిపై పారుతున్న మురుగు నీరు



ఇళ్ల ముందు తిష్ఠ వేసిన మురుగు

పడకేసిన పారిశుధ్యం

డ్రైనేజీ వ్యవస్థ లేక గల్లవానిపాలెం, శనివాడ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న మురుగు, వాడుక నీరు

తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

అగనంపూడి, ఫిబ్రవరి 10: జీవీఎంసీ 79వ వార్డు పరిధి గల్లవానిపాలెం, శనివాడ ప్రాంతాలను డ్రైనేజీ సమస్య పట్టి పీడిస్తోంది. పెరుగుతున్న నివాసాలకు తోడు అపార్ట్‌మెంట్ల నిర్మాణాలతో గ్రామాలు విస్తరించాయి. అయినప్పటికీ పూర్తి స్థాయిలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు, వాడుక నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండడంతో పాటు పలుచోట్ల రహదారులపై పారుతున్నాయి. పలుచోట్ల రోజుల తరబడి మురుగు తిష్ఠ వేస్తుండడంతో భరించరాని దుర్వాసనతో సతమతం అవుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం అధ్వానంగా మారడంతో దోమలు వృద్ధి చెంది రాత్రిపూట కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. ఈ ప్రాంతాలు పారిశ్రామికంగా దినాదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో డ్రైనేజీలను నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పూర్తి స్థాయిలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి

-విందుల చిరురాజు, స్థానికుడు



గ్రామాల్లో పూర్తి స్థాయిలో డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చాలాచోట్ల వాడుక నీరు, మురుగు నీరు రహదారు పైనుంచి పారుతుంది. వాడుక నీరు పోయేందుకు మార్గం లేక ఇళ్ల మధ్యే నిలిచిపోతుంది. దీంతో పారిశుధ్యం అధ్వానంగా మారుతూ వీధులు కంపు కొడుతున్నాయి. డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మాణం చేపట్టాలి.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, ఫిబ్రవరి 10: రాష్ట్రాభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని, అందువల్ల రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కోరారు. 92వ వార్డు పరిధి దోబీ కాలనీలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిపై ఎంతో దూరదృష్టి ఉన్న చంద్రబాబు నాడు రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న మహాశక్తి, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాత పథకాలతో పాటు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పలువురికి అందజేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'బాబు ష్యూరిటీ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

టీడీపీతోనే ప్రజలకు మేలు

కూర్మన్నపాలెం: తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని, ప్రజలందరికీ మేలు చేకూరుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి గవరవీధిలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు ష్యూరిటీ అని అన్నారు. వైసీపీ అకాచక పాలనలో ఇమడలేకే ఆ పార్టీ నాయకులు పలువురు టీడీపీలోకి వచ్చేందుకు క్యూ కడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలంటూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, పెంటారావు, శ్రీనివాసవర్మ, సత్తిబాబు, రాజన్‌రాజు, అప్పలనాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి చరమగీతం పాడాలి

అగనంపూడి: రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి అట్టా సన్యాసి అప్పారావు విజ్ఞప్తి చేశారు. కన్నూరు శివారు మామిడివానిపాలెంలోని పలు పోలింగ్ బూత్‌ల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో అవినీతి తప్ప అభివృద్ధికి చోటులేదని విమర్శించారు. నాయకులు పోతల నూకరత్నం, పైలా బుజ్జి, వి.చంద్రశేఖర్, నందీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గైరమ్మ సంబరం

సారె సంబరంలో పాల్గొన్న వందలాది మంది భక్తులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 10: స్థానిక కొత్తపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గైరమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సారెను పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తుల ఊరేగింపు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా వీధులన్నింటినీ విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం నుంచి గ్రామ ప్రధాన రహదారిలో జరిగిన ఉత్సవాన్ని తిలకించడానికి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. బుల్లితెర కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పూజలందుకున్న గౌరీ పరమేశ్వరులు.. పక్కన సారె సంబరంలో పాల్గొన్న భక్తులు

తలరాతలు మార్చే అస్త్రం ఓటు

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు

శ్రీనగర్, ఫిబ్రవరి 10: ఓటు అన్నది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు మాత్రమే కాదని, మన తలరాతలు మార్చే అస్త్రం ఓటు అని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన జనసేన వీర మహిళల సదస్సులో ఆయన మాట్లాడుతూ జనసేనతోనే మహిళా సాధికారత సాధ్యమన్నారు. ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు, చేయూత, విద్యా దీవెన, వడ్డీలు లేని రుణాలంటూ హడావుడి చేస్తున్న వైసీపీ గిమ్మిక్కులను ప్రజలు గ్రహించారన్నారు. వైసీపీ ఏమి ఇచ్చినా అందరూ తీసుకోవాలని, అది ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన మన డబ్బేనన్నారు. ఓటు మాత్రం జనసేన-టీడీపీ అభ్యర్థులకు మాత్రమే వేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం వీరమహిళలు శ్రమించాలన్నారు. కార్పొరేటర్ డి.గోవిందరెడ్డి నాయకులు జి.అప్పారావు, టి.రమణారెడ్డి, లంకల మురళీదేవి, జ్యోతి, షాలిని, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోన తాతారావు

కూర్మన్నపాలెం: జనసేన గెలుపుతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. కూర్మన్నపాలెంలో జనసేన పార్టీ 86వ వార్డు ఇన్‌చార్జి కాదా శ్రీను అధ్యక్షతన జరిగిన జనసైనికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై గళమెత్తాలన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు తినాథ్, రాజు, సూరి అప్పారావు, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల సమస్యలను పాలసీల ద్వారా పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

ఆటోనగర్, ఫిబ్రవరి 10: పరిశ్రమల సమస్యలను పాలసీల ద్వారా పరిష్కరిస్తామని సైన్ ఫార్మా కంపెనీ డైరెక్టర్ జెట్టి సుబ్బారావు అన్నారు. నూతన టెక్నాలజీ, స్కీమ్స్‌ను పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని సూచించారు. విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోషియేషన్ (వాసీవా) కార్యాలయంలో శనివారం లఘు ఉద్యోగ భారతి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సుబ్బారావుతో పాటు లఘు ఉద్యోగ భారతి ఏపీ, తెలంగాణ కో-ఆర్డినేటర్ జి.అనంత్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లఘు ఉద్యోగ భారతి ఎంఎస్ఎంఈల కోసం నాన్ బ్యాంకింగ్ సంస్థ యూగ్రో, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలను ఏర్పాటు చేసిందన్నారు. చిన్న కంపెనీలు సైతం షేర్ల ద్వారా పబ్లిక్ మార్కెట్‌కు వెళ్లవచ్చన్నారు. లఘు ఉద్యోగ భారతి ఏపీ కో-ఆర్డినేటర్ ఏకే బాలాజీ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఈ అండగా ఉంటుందన్నారు. ఎల్‌యూబీ విశాఖ అధ్యక్షుడు అట్లూరి రమేశ్ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌యూబీ ఏపీ ప్రధాన కార్యదర్శి పవన్ జైస్వాల్, కార్యదర్శి యోగీశ్‌చంద్ర తులసి, ఐలా మాజీ ఛైర్మన్లు వై.సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, వాసీవా ప్రతినిధులు పి.ప్రభాకర్, రామ్‌ప్రసాద్, చీకటి సత్యనారాయణ, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

'ముందస్తు అరెస్టు అన్యాయం'

పెదగంట్యాడ, ఫిబ్రవరి 10: మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీఎం కార్యాలయాన్ని ముట్టడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ముట్టడికి జిల్లా నుంచి నాయకత్వం వహిస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్చుతరావును న్యూపోర్టు పోలీసులు శనివారం ఉదయం భానోజీతోటలోని ఆయన ఇంట్లో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అచ్యుతరావును ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని సీపీఐ 'గాజువాక' కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, జి ఆనంద్, పి.దుర్గారావులు పేర్కొన్నారు.

సీఐకు టీడీపీ నాయకుల అభినందనలు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 10: న్యూపోర్టు పోలీస్ స్టేషన్ శాంతిభద్రతల విభాగం సీఐగా బాధ్యతలు చేపట్టిన దాలిబాబును టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దాడ సోమునాయుడు, ములకలపల్లి పెంటయ్య, మొల్లి రమణ, మొల్లి అప్పారావు, ఎంఎస్ రాజు, అండిబోయిన రామునాయుడు, టేకేటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘ నాయకులు

ఉక్కులో సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 10: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించరాదని, ఉద్యోగులకు నూతన వేతనాలను చెల్లించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్న తదితర డిమాండ్లతో ఈ నెల 16న చేపట్టనున్న కార్మిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కర్మాగారంలో కార్మిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సెయిల్‌లో మాదిరిగానే స్టీల్‌ప్లాంట్‌లో కూడా చెల్లింపులు జరిగేవని, కానీ ఇప్పుడు వాటిని యాజమాన్యం విస్మరించిందన్నారు. వేతనాల పెంపును కంపెనీ ఆర్థిక పరిస్థితులతో ముడిపెట్టవద్దన్నారు. ఉద్యోగులు, కార్మికులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు చేపట్టరాదన్నారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం చాలా గొప్పది



ఉద్యోగులను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 10: ప్రపంచంలోనే చాలా గొప్పది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగం అని స్టీల్‌ప్లాంట్ ఏసీపీ విభాగాధిపతి చిట్టిబాబు అన్నారు. ప్లాంట్‌లో విధులు నిర్వహించి ఇటీవల కాలంలో పదవీ విరమణ చేసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు 34 మందిని అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం వల్ల అన్ని వర్గాల ప్రజలు సుఖంగా జీవనం సాగిస్తున్నారన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొండా తౌడన్న, ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, కేవీ రత్నం, మోహన్‌బాబు, పుల్లారావు, ఫణింద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు ఆత్మీయ వీడ్కోలు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 10: గోపాలపట్నం తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన కె.జయకు శనివారం సాయంత్రం రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రస్తుత తహసీల్దార్ విజయభాస్కర్, తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణబాయి, సర్వేయర్ జగదీశ్వరరావు, ఆర్ఎస్‌డీటీ వరలక్ష్మి, ఆర్ఐ సురేశ్‌కుమార్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

భెల్ హెచ్‌ఆర్ విభాగాధిపతికి సన్మానం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 10: భెల్ హెచ్‌పీవీపీ హెచ్‌ఆర్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఎంవీఎస్ఎన్ రాజుకు ఢిల్లీలోని భెల్ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ కావడంతో శనివారం గుర్తింపు కార్మిక సంఘ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. నాయకులు కొల్లి దేముడు, బాబూరావు, సాహు, పీవీఎస్ రాజు, బి.రవీంద్రబాబు, రాము, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

అగనంపూడి, ఫిబ్రవరి 10: జీవీఎంసీ 85వ వార్డు పరిధి దిబ్బపాలెంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రథమ క్లినిక్, విజన్ కేర్ సౌజన్యంతో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. స్థానిక ఏరియా ఆస్పత్రి డాక్టర్ కళావతి, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి సత్యనారాయణలు శిబిరాన్ని ప్రారంభించగా, నేత్ర వైద్యుడు శివకుమార్ ఆధ్వర్యంలో సుమారు 80 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శీరంశెట్టి బాబ్జీ, పి.సత్యారావు, పి.అప్పారావు, ఎస్.శంకర్, నీలావతి, పుష్ప, లిఖిత, తదితరులు పాల్గొన్నారు.

నేడు భక్తి గీతాలాపన

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10: రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12వరకు గానసుధ గల్లా చిట్టిబాబు బృందంతో భక్తి గీతాలపన కార్యక్రమం ఉంటుందనిఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు.

జనసేనలోకి వైసీపీ నేత

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10: జనసేన పార్టీలోకి జీవీఎంసీ పరిధి 31వ వైసీపీ వార్డు మాజీ అధ్యక్షులు మొకర గోపి చేరారు. శనివారం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనియాస్‌యాదవ్ సమక్షంలోపార్టీలోకి చేరారు.

నేడు దుర్గా మహిళా సంఘ సమావేశం

అక్కయ్యపాలెం: దుర్గా మహిళా సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం ఆదివారం సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న తోటలో జరగనున్నట్టు సంఘ అధ్యక్షురాలు బి.వేళాంగిణి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఖర్చు, జమ కు లెక్కలు, సభ్యుల సంక్షేమం అంశాలను చర్చిస్తారు.

16న సమ్మె విజయవంతం చేయాలి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10: దేశ వ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించనున్న సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశంలో ఆయన మాట్లాడారు.





పూర్ణా మార్కెట్‌లో అక్రమంగా ఆశీల వసూలు

» చిరు వ్యాపారులు గగ్గోలు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 10:వన్‌టౌన్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ (పూర్ణామార్కెట్)లో ఆశీలు కాంట్రాక్టర్ అక్రమ వసూళ్లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీంతో చిరువ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వన్‌టౌన్ పోలీసులు రోడ్డుపై వ్యాపారాలను తొలగించారు. మార్కెట్ ఎదుట పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతుండడంతో అటువైపు వ్యాపారాలను పోలీసులు పూర్తి నియంత్రించారు. దీంతో ఆశీలు కాంట్రాక్టర్ మార్కెట్ ప్రధాన గేటు వైపు రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వారి నుంచి అధికంగా ఆశీలు వసూలు చేస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. అలాగే, పోలీసులు నియంత్రించిన రోడ్డుపైన రాత్రి ఏడు గంటల తర్వాత వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కాంట్రాక్టర్ వీరి నుంచి కూడా ఆశీలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. రోడ్డుమీద వ్యాపారంచేసే వారినుంచి రూ. 30 చెల్లించాల్సి ఉంటే.. రూ. 200 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఆశీలు చెల్లించమని నిరాకరిస్తే... కాంట్రాక్టర్ నియమించిన సిబ్బంది వ్యాపారాలను చిందవందర చేస్తున్నారని వాపోతున్నారు. ఓ రకంగా పోలీసులు రోడ్డుమీద వ్యాపారాలు తొలగించడం కాంట్రాక్టర్ అక్రమవసూళ్లకు వెసులుబాటుగా మారిందని వర్తకసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇక్కడ అక్రమ ఆశీలు వసూలు వ్యవహారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్‌అండదండలతోనే సాగుతుందని సీపీఎం నేతలు గతంలో బహిరంగ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు స్థానిక కార్పొరేటర్ విల్లూరిభాస్కరరావు ఫిర్యాదు చేయడంతో వారు స్పందించి ఆశీలు కాంట్రాక్టర్ గత డిసెంబరులో రద్దు చేశారు.తర్వాత జీవీఎంసీ, సచివాలయ ఉద్యోగులు ఆశీలు వసూలు చేశారు. దీంతో అడ్డగోలు వసూళ్లకు బ్రేక్ పడినట్లయింది. జనవరిలో కాంట్రాక్టర్‌కు జోనల్ అధికారులు తిరిగి ఆశీలు వసూలుకు అవకావం కల్పించారు. ఈ స్థితిలో కాంట్రాక్టర్ సంక్రాంతి రోజుల్లో భారీగా దోపిడీకి పాల్పడినట్టు విమర్శలు వచ్చాయి. ట్రాఫిక్ పోలీసులు మరోమారు ఆక్రమణల పేరిట దుకాణాలు తొలగించడంతో మళ్లీ కాంట్రాక్టర్‌కు కలిసివచ్చినయింది. కొంతమంది అధికారులుకాంట్రాక్టర్‌తో కుమ్మక్కై పీడిస్తుండడంతో చిరువ్యాపారులుగగ్గోలు పెడుతున్నారు. రోడ్డుపై వ్యాపారాలనునిరోధించాలనిలోన అధికారంగా వ్యాపారాలుసాగిస్తున్నవర్తకులు కోరుతున్నారు. అక్రమ ఆశీలు వసూళ్లను నిరోధించాలని పలువురు వేడుకుంటున్నారు.


పూర్ణా మార్కెట్ ఎదుట వ్యాపారులు

లోకేశ్ పర్యటనతో జగన్ పాలనకు చరమగీతం

» టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ


మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించనున్న శంఖారావంతో సీఎం జగన్మోహనరెడ్డి పాలనకు చరమగీతం తథ్యమని ఆ పార్టీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. లోకేశ్ రాష్ట్రంలో యువగళంపేరిట 3,200 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తిచేశారన్నారు. ఈ పాదయాత్రలో పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరిట ఆది వారం నుంచి ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు.రోజుకు మూడు నియోజ కవర్గాల చొప్పున పర్యటిస్తారన్నారు.ఈనెల 17న యాత్ర విశాఖకు చేరుకుంటుందని వివరించారు. విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

సజ్జలతో అక్కరమాని దంపతుల భేటీ!

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 10: వీఎంఆర్‌డీఏ పూర్వ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల దంపతులు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త బాధ్యతలను అక్కరమానిని తప్పించి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను నియమించడంతో కొంతకాలంగా విజయనిర్మల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల తగరపువలసలో జరిగిన ముఖ్యమంత్రి జగన్ సభకు కూడా హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం పిలుపుతో అమరావతికి వెళ్లిన దంపతులతో సజ్జల మాట్లాడినట్టు సమాచారం. పార్టీలో సముచిత ప్రాధాన్యం లభిస్తుందని, తొందపాటు నిర్ణయాలు తీసుకోవద్దని వారికినచ్చచెప్పారని, త్వరలో సీఎం జగన్‌తో సమావేశం ఏర్పాటుచేస్తానని హామీ కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. దీంతో అక్కరమాని మళ్లీక్రియాశీలకంగా వ్యవహరిస్తారని తూర్పునేతలు భావిస్తున్నారు.

నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హౌస్ అరెస్ట్



ప్లకార్డు ప్రదర్శిస్తున్న హేమంతకుమార్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడికి నిరుద్యోగులు పిలుపునివ్వడంతో ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్‌ను శనివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఆయన ఇంట్లో ముందస్తుగా నిర్బంధించారు. ఈసందర్భంగా హేమంతకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 23 వేల ఉద్యోగాలతో డీఎస్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్రెంటిస్ విధానం గత 12 ఏళ్ల క్రితం రద్దయినా దాన్ని మళ్లీ అమలు చేయడం అన్యాయమని చెప్పారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ వయోపరిమితి జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్లకు పెంచాలన్నారు. మూగ, చెవిటి అభ్యర్థులకు స్పెషల్ డీఎస్సీ ద్వారా పోస్టులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం ఖాళీలు 26వేల ఉద్యోగాలతో నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉందని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సచివాలయానికి ఒక డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి 15వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

వలంటైన్స్ డేను బహిష్కరించాలి: జన జాగరణ సమితి


పోస్టర్లు ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 10: ఈ నెల 14న వలంటైన్స్ డేను బహిష్కరించాలని కోరుతూ ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్సు ఎదుటనున్న ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ విద్యార్థులకు జన జాగరణ సమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ తాము స్వచ్ఛమైన ప్రేమికులకు, ప్రేమ పెళ్లిళ్లకు వ్యతిరేకం కాదని, ప్రేమికుల రోజు పేరుతో జరిగే విచ్చలవిడితనానికి, అమ్మాయిలపై జరిగే హింస, మత్తు పదార్థాల వినియోగానికి పూర్తిగా వ్యతిరేకమన్నారు. యువత స్వచ్ఛందంగా ప్రేమికుల రోజును బహిష్కరించి దేశ సంస్కృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, సామాజిక కార్యకర్త శ్రీహరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు


కల్యాణోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, ఫిబ్రవరి 10: స్థానిక టీపీటీ కాలనీలోని ద్రావిడ సంక్షేమ లలిత కళ్యాణ మండపంలో శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటే శ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు వేదమంత్రాలమధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. గురూజీ కేపే రాజు, ఆచార్య జీఎస్ఎన్ రాజు, వంకాయల సన్యాసి రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ద్వారం మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ ద్వారం త్యాగరాజు బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. శృతిలయ సంస్థ వ్యవస్థాకులు వి.ప్రభాకర్, ఎంవి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

'పత్రికలు వాస్తవాలను ప్రతిబింబింపచేయాలి'


మాట్లాడుతున్న ఏపీ జర్నలిజం కాలేజీ డైరెక్టర్ సతీష్ చందర్

సీతంపేట, ఫిబ్రవరి 10: పత్రికలు వాస్తవాలను వక్రీకరిస్తూ నిజాన్ని మరుగున పడేటట్లు చేస్తున్నాయని ప్రముఖ రచయిత, కవి, ఏపీ జర్నలిజం కాలేజీ డైరెక్టర్ సతీష్ చందర్ అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలోమీడియా- సామాజిక న్యాయం' అనే అంశంపై సదస్సును శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సతీష్ చందర్ మాట్లాడుతూ అంబేడ్కర్ సాధించిన విజయాలను ఆనాటి పత్రికలు పరాజయాలుగా చూపించాయన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతన్న అనేక అకృత్యాలు ప్రస్తుతం మీడియాలో కానరావట్లేదన్నారు. స్వాతంత్ర పోరాటంలో భాగంగా దళితులను చైతన్యవంతం చేసేందుకుఅంబేడ్కర్‌పత్రికను స్థాపించారన్నారు.ఏయూ జర్నలిజం విభాగం పూర్వ విభాధిపతి ప్రొఫెసర్ పి.బాబీవర్ధన్ మాట్లాడుతూ ప్రజలను జాగృతం చేయడానికి అంబేడ్కర్ చదవని అంశం లేదన్నారు.లీడర్ సంపాదకులు వీవీ రమణమూర్తి, అంబేడ్కర్ మెమోరియాల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, సొసైటీ కార్యదర్శి జె.వి. ప్రభాకర్, జర్నలిస్టు జేకేడీ ప్రసాద్, ఏయూప్రొఫెసర్ వీడీ సత్యపాల్, డాక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ ప్రజ్ఞ ఉన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి


విజేతలకు సర్టిఫికెట్స్ ఇస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10: విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని స్థితప్రజ్ఞ ఎండీ వైవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ఎంజీఎం స్కూల్‌లో స్థితప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయాలను ఏర్పచుకుని వాటిని సాధనకుకృషి చేయాలన్నారు. హెచ్ నాగభూషణం, సభ్యులు వై.ప్రదీప్, దుర్గాబాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై కళాజాత

సీతమ్మధార, ఫిబ్రవరి 10: పరిసరాల పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని జీవీఎంసీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ కిషోర్ అన్నారు. సీతమ్మధారలో పలు ప్రాంతాల్లో జీవీఎంసీ ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తదితర వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైకే రాజు కళాబృందం వీధి నాటిక, జానపద గీతాలతో పారిశుద్ధ్య ప్రాధాన్యంపై అవగాహనకల్పించారు.

నేడు కాళింగుల ఆత్మీయ సమ్మేళనం

మాధవధార, ఫిబ్రవరి 10 ; మాధవధార ఉడాకాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం కాళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఖారవేల్ ఎడ్యుకేషనల్, కల్చరల్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పేడాడ.నరసింగరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి సామాజిక వర్గ ప్రముఖులు హాజరవుతున్నారు. రానున్న ఎన్నికల్లో తమ సామాజిక వర్గ అభ్యర్థులను పార్టీలకతీతంగా మద్దతునిచ్చి గెలుపొందేలా చూడాలని, ఐక్యత ప్రధాన ఎజెండాగా సభ నిర్వహిస్తున్నామన్నారు.

41వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జ్ఞానాపురం, ఫిబ్రవరి 10: జీవీఎంసీ 41వ వార్డులో జ్ఞానాపురం, కాన్వెంట్ కూడలి, సుబ్బలక్ష్మీ నగర్‌లో సుమారు రూ.1. 92 కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులకు శనివారంవార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూరి మతో కలిసి స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్ శంకుస్థాపన చేశారు. వార్డు నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ, డీఈ భరణి, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

లోకేశ్‌కు ఘన స్వాగతం

... 3వ పేజీ తరువాయి

పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రులు బండారు సత్యనారాయణమూర్తి, కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, గండి బాబ్జీ, వంగలపూడి అనిత, నేతలు కోరాడ రాజబాబు, మహ్మద్ నజీర్, పాశర్ల ప్రసాద్, రెడ్డి నారాయణరావు, పుచ్చా విజయకుమార్, పీఎస్ నాయుడు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈనెల17వ తేదీ నుంచి విశాఖ జిల్లాలో చేపట్టనున్న శంఖారావం యాత్రపై నాయకులతో లోకేశ్ ముచ్చటించారు. అనంతరం రోడ్డు మార్గంలో శ్రీకాకుళంజిల్లాఇచ్ఛాపురంబయలుదేరివెళ్లారు.ఆదివారం'శంఖారావం' ప్రారం భించనున్నారు.

విశాఖ జిల్లాలో 17 నుంచి పేర్యటన: శంఖారావం యాత్రలో భాగంగా నారా లోకేశ్ ఈనెల 17వ తేదీ నుంచి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. 17వ తేదీ సాయంత్రం భీమిలి నియోజకవర్గంలో సభ, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. 18వ తేదీ ఉదయం విశాఖ తూర్పు, మధ్యాహ్నం దక్షిణ, రాత్రికి ఉత్తర నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. కార్యకర్తలతో సమావేశాలు, బహిరంగ సభలు ఉంటాయనిపార్టీ వర్గాలు తెలిపాయి. 19వ తేదీన విశాఖ పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల్లో పర్యటించిన అనంతరం అనకాపల్లి జిల్లాకు వెళతారు.

అవే తప్పులు... ఓటుకు తిప్పలు!

... 3వ పేజీ తరువాయి

సూచించడంతో పలువురు ఆసక్తి చూపలేదనే ఫిర్యాదులు ఉన్నాయి.

'తూర్పు'లో తప్పులు...

పాత డెయిరీ ఫారం ప్రాంతంలో ఇంటి నంబరు 5-608/ 26లో నివాసం ఉంటున్న రవికుమార్ ముక్కాలకు ఒకే ఎపిక్ నంబరు ఆర్‌వైజడ్ 0277251తో బూత్ నంబరు 67 (సీరియల్ నంబరు 1435), 70 (సీరియల్ నంబరు 618)లో ఓట్లు ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతంలో ఇంటి నంబరు 16-688లో నివసిస్తున్న కొండపల్లి రాజేష్‌కు ఎపిక్ నంబరు ఏసీకే 9512022తో బూత్ నంబరు 10లో (సీరియల్ నంబరు 781), బూత్ నంబరు 12లో (సీరియల్ నంబరు 532)లో ఓట్లు ఉన్నాయి. ఆరిలోవ ఇంటి నంబరు 16-688లో ఉంటున్న గౌరీ స్వరాజ్‌కు ఎపిక్ నంబర్ ఐడీఎస్ 0097600తో బూత్ నంబరు నాలుగులో (సీరియల్ నంబరు 599), బూత్ నంబరు 12లో (సీరియల్ నంబరు 544)లో ఓట్లు ఉన్నాయి.

» కొత్తగా ఓటు కోసం సుజితగుప్త గత ఏడాది అక్టోబరు 25న, సూర్యవసంత నవంబరు 16న దరఖాస్తు చేసుకోగా, ఆన్‌లైన్‌లో ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నట్టు చూపిస్తోంది. నిబంధనల మేరకు రెండు వారాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఓటు హక్కు కల్పించాలి. కానీ ఇంతవరకూ ఎలాంటి చర్యలు లేవు.

» ఈస్టుపాయింట్ కాలనీ ఇంటి నంబరు 6-15-24లో ఉంటున్న అబ్దుల్ నిజాముద్దీన్‌కు బూత్ నంబరు 172లో ఓటర్ల జాబితాలో వరుస సంఖ్య 422 (ఎపిక్ నంబరు-ఐడీవై 2844488), వరుస సంఖ్య 691 (ఎపిక్ నంబరు -ఐడీవై 2972008)తో రెండు ఓట్లు ఉన్నాయి. దీంతో ఆయన ఒక ఓటును తొలగించాలని దరఖాస్తు చేయగా రెండు ఓట్లనూ తొలగించేశారు.

» తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎంవీపీ కాలనీ సెక్టార్-5లో నివాసముంటున్నారు. ఆయన ఇంట్లో ఎమ్మెల్యే, సతీమణి, ఇద్దరు కుమారులు, కోడలు ఉంటున్నారు. కాగా ఎమ్మెల్యే కోడలుకు సెవెన్త్‌డే స్కూలులో ఉన్న బూత్, మిగిలిన నలుగురికి గిరిజన భవన్ బూత్‌లో ఓటు హక్కు కల్పించారు.

» ఆరిలోవకు చెందిన బుగత తాతారావు కుటుంబంలో ముగ్గురికి ఓట్లు ఉన్నాయి. తాతారావు ఓటు రవీంద్రనగర్ ఎంపీఈపీ స్కూలులో ఉన్న బూత్ నంబరు 65లో, భార్య నారాయణమ్మ ఓటు అదే ప్రాంగణంలోని బూత్ నంబరు 68, కుమార్తె మౌనిక ఓటు ఎస్ఐజీ నగర్‌లోని బూత్‌నంబరు 70లో ఉన్నాయి.

గత నెల 22న విడుదల చేసిన తుది జాబితాలో చాలా మృతుల ఓట్లను ఉంచేశారు. ఎపిక్ నంబరు ఐడీవై 2521193తో ఇంటి నంబరు 18-443లోని పైడితల్లి మృతిచెందినా జాబితాలో తొలగించలేదు.

రెండు, అంతకంటే ఎక్కువ ఓట్లు...

ఇంటి నంబరు 7-24లో ఉంటున్న గుడిపాటి శ్రావణికి మూడు ఓట్లు ఉన్నాయి. అలాగే ఇంటి నంబరు 19-210/2లోని ఫ్లాట్ నంబరు 54లో ఉన్న వంక ధనశ్రీకి రెండు, డోర్ నంబరు 19-182/11లో ఉన్న పిల్లా కనకరాజుకు రెండు ఓట్లు ఉన్నాయి. ప్రతి బూత్‌లో కనీసం 10 నుంచి 20 మందికి రెండేసి ఓట్లు ఉన్నాయి. ముసాయిదా జాబితాలో డబుల్ ఎంట్రీలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకుండా తుది జాబితాలోనూ వాటిని యధాతథంగా ఉంచారు.

చట్ట సభల్లో బహుజనుల గళం అవసరం


సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ ప్రతినిధులు

మహారాణిపేట, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో బహుజన కులాల పాలన రావాలంటే చట్ట సభల్లో వారి గళం వినిపించాలని బీఎస్పీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పెదపెంకి శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రానున్న ఎన్నికల్లో పోటీచేయనున్న విశాఖ జిల్లా ఎమ్మెల్యే అభ్యర్థులతో కలసి పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వెనుకబడిన కులాల రాజ్యాధికారం కోసం కాన్షీరామ్ పార్టీ స్థాపించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రానున్న ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. తిరుపతిరావు , ఎస్.కోట ఇన్‌చార్జి బోని కృష్ణ, కదిరి రాము, పి కనకమహాలక్ష్మి, రమేష్ రామచంద్రరావు, ధనుంజయ్, రమణ పాల్గొన్నారు.

సత్యసాయినగర్‌లో చెత్త తొలగింపు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10: గ్రేటర్ 45వ వార్డు కొండవాలు ప్రాంత సత్యసాయినగర్‌లో పేరుకున్న చెత్తను ఎట్టకేలకు పారిశుధ్య కార్మికులు శనివారం తొలగించారు. ఈ ప్రాంతంలో సుమారుగా 500 మంది నివశిస్తున్నారు. పరిసరాల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు ప్రబలుతున్నాయి. అలాగే కొండప్రాంతం కావడం వల్ల పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయి. ఈ విషయాన్ని భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ దృష్టికి తీసుకొని వెళ్ళినట్లు స్థానికులు చెబుతున్నారు. వారు స్పందించి జోనల్ కమిషనర్ ఆర్వీ కృష్ణతో చర్చించి పారిశుధ్య సిబ్బందితో చెత్తను తొలగించే చర్యలు చేపట్టారు. సింహాచలం దేవస్థానం సిబ్బంది వచ్చి పరిశీలించారు.

హెచ్‌పీసీఎల్‌లో భారీ చోరీ

... 3వ పేజీ తరువాయి

క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌పీసీఎల్ చరిత్రలో జరిగిన అతి భారీ చోరీ ఇదే. దీని వెనుక సంస్థకు చెందిన ఓ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉండడం గమనార్హం. చమురు శుద్ధి యూనిట్లలో ఉష్ణోగ్రతల నమోదు సమయంలో ఈ కాపర్‌ను వినియోగిస్తుంటారు. ఇటీవలే ఇతర ప్రాంతాల నుంచి కాపర్‌ను తెచ్చి సంబంధిత యూనిట్‌లో బిగించారు. మిగిలిన బండిల్స్‌ను తిరిగి హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి అప్పగించాల్సి ఉంది. అయితే ఈ పనిని ఒప్పుకున్న జయలక్ష్మి ఇంజనీరింగ్ సంస్థ యజమాని బంధువు ఒకరు గత నెల 28న ఓ వ్యాన్‌లో ఆ కాపర్ బండిల్స్‌ను బయటకు తరలించారు. శుక్రవారం సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తుండగా కాపర్ బండిల్స్‌ను వ్యాన్‌లో బయటకు పంపేసిన దృశ్యాలు చూసి అధికారులు ఖంగుతిన్నారు. దీనిపై అధికారులు ఆరా తీయగా హెచ్‌పీసీఎల్‌లోకి ప్రవేశించేందుకు నకిలీ పాస్‌ను తయారుచేసి, దాని ద్వారా ఆ వ్యక్తి లోపలకు ప్రవేశించి చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఈ పాస్ తయారీకి, కాపర్ బండిల్స్ బయటకు పోవడానికి సంస్థకు చెందిన ఓ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ సహకరించినట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఇది భారీ చోరీ కావడంతో ఫిర్యాదు అందిన శుక్రవారం అర్ధరాత్రి నుంచే పోలీసులు విచారణ ప్రారంభించారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు, హెచ్‌పీసీఎల్ అధికారులు శనివారం వేకువజాము నాలుగు గంటల సమయంలో మళ్లీ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణను వేగవంతం చేయవలసిందిగా కోరారు. కాగా ఈ కేసు లా అండ్ ఆర్డర్‌కు పరిధిలోకి వస్తుందా లేదా క్రైమ్ విభాగానికి వస్తుందా అని పోలీసు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. నకిలీ పాస్ తయారుచేసి చోరీకి పాల్పడినందున ఈ కేసును లా అండ్ ఆర్డర్ పోలీసులే దర్యాప్తు చేయాల్సి ఉంటుందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. దొంగతనం జరిగింది కాబట్టి క్రైమ్ విభాగం పోలీసులే దర్యాప్తు చేయాలని మరికొందరు పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి ఈ కేసును లా అండ్ ఆర్డర్ పోలీసులే దర్యాప్తు చేస్తున్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో అరకొర సదుపాయాలు

... 3వ పేజీ తరువాయి

ఆశ్రయించారు.

కడప క్రీడాకారిణికి గాయం

ఏయూలో కడప, చిత్తూరు జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలలో కడప జట్టు క్రీడాకారిణి మోటూరి భారతి తలకు తీవ్ర గాయమైంది. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఇరు జట్లు తలపడినప్పుడు చిత్తూరు జిల్లా నుంచి రైడ్(కూత)కు వచ్చిన రైడర్‌ను ఆపే ప్రయత్నంలో భారతి గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు అశోక్‌కుమార్ తెలిపారు. శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ కేజీహెచ్‌కు వెళ్లి క్రీడాకారిణిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

సింహగిరి కాలనీలో దొంగల హల్‌చల్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10:సింహగిరి కాలనీలో దొంగలు రెచ్చిపోయి అందినకాడికి దోచేస్తున్నారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలులేక దొంగల పని సులువవుతోంది. శుక్రవారం రాత్రి పార్కింగ్ చేసిన మూడు ఆటోలకుచెందిన నాలుగు టైర్లను విప్పి ఆగంతకులు పట్టుకుపోయారు. శనివారం ఉదయం గుర్తించిన యజమానులు అనసూరి పెంటారావు, నర్సింగ్, లక్ష్మణ రావు లబోదిబోమంటున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోరలు చాస్తున్న కేన్సర్

... 3వ పేజీ తరువాయి

మహిళలు ఉంటుండగా, పురుషులు 49 శాతం మంది ఉంటున్నారు. చిన్నారుల్లో వచ్చే కేన్సర్లు ఒక శాతం కంటే తక్కువ ఉంటున్నాయి. రోబోటిక్ సర్జరీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, రేడియో థెరపీ, అడాప్టివ్ రేడియో థెరపీ, ఇమ్యునో థెరపీ వంటి అధునాతన వైద్య పద్ధతులతో రోగులు జీవన ప్రమాణాన్ని పెంచడంతో పూర్తిగా కోలుకునేలా కూడా చేస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అవగాహన అవసరం: పొగాకు ఉత్పత్తుల వినియోగం, మద్యం అలవాటుకు దూరంగా ఉండడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, బరువు అదుపులో ఉంచుకోవడం, కొన్నిరకాల వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల కేన్సర్ బారినపడ కుండా ఉండవచ్చు. పురుషుల్లో వస్తున్న కేన్సర్లకు పొగాకు, మద్యపానం అలవాట్లు 90 శాతం కారణం అవుతుండగా, మహిళల్లో జన్యుపరమైన అంశాలు, లైంగిక సంబంధాలు, కొన్నిరకాల వైరస్‌ల వల్ల రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్లు అధికంగా వస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. మహిళలు రొమ్ము పరీక్ష చేయించుకోవడంతో పాటు 25 ఏళ్లు దాటిన వాళ్లంతా పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవడం వల్ల గర్భాశయ కేన్సర్‌ను సకాలంలో గుర్తించేందుకు అవకాశముంది. తొమ్మిది నుంచి 13 ఏళ్లలోపు బాలికలకు గర్భాశయ కేన్సర్ రాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

కేజీహెచ్‌లో ఉచితంగా పరీక్షలు: కేజీహెచ్‌లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్లను నిర్ధారించే పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. రొమ్ము కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నెలకు 150 వరకు చేస్తుండగా, గర్భాశయ ముఖద్వార కేన్సర్ నిర్ధారణ పరీక్షలు 400 వరకు చేస్తున్నారు. అయితే లక్షణాలను బట్టి వైద్యులే ఈ పరీక్షలు చేయించు కోవాలని సూచిస్తున్నారు తప్ప.స్వతహాగా పరీక్షలు చేయించుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వైద్యులు చెబుతున్నారు.

మహిళలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించవద్దు

- డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, గైనకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

కేన్సర్ పట్ల మహిళలు అవగాహనతో ఉండాలి. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని సకాలంలో గుర్తించేందుకు అవకాశం ఉంది. కేజీహెచ్‌లో రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కేన్సర్ పరీక్ష అంటేనే చాలామంది భయపడుతున్నారు. పరీక్షలు చేయించుకోవడం వల్ల వచ్చే ఇబ్బందులు ఏమీ ఉండవన్న విషయాన్ని గుర్తించుకోవాలి.



వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 10 :వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, ఫిబ్రవరి 10 :వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన గేదెల రాజేష్, అరుంధతి దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ. 1,00,116 లను నగదు రూపంలో దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి అప్పలనాయుడుకు శనివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి,వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేడు సుపథ ప్రతిభా పరీక్షలు

పద్మనాభం, ఫిబ్రవరి 10 : పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ సభ్యుడు ఏవీఆర్ఎస్ శర్మ తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం, మాతృభాష పట్ల ఆసక్తి కలిగించడంతో పాటు సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు ఆరేళ్లుగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది 16 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు చెప్పారు.

పోలమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

తగరపువలస, ఫిబ్రవరి 10 : చిట్టివలసలోని పోలమ్మ ఆలయ ఆవరణలో పలు దేవతా విగ్రహాలను శనివారం ప్రతిష్ఠించారు. ఆలయ ఆవరణలో వినాయక, సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలతో పాటు అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ముందుగా కమిటీ సభ్యులు, దాతలు విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో కాళ్ల పురుషోత్తం, సరగడ నరసింగరావు, పినింట్ల సింహాచలం, జీరు రాము, ఆదెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 : పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. చిన్నబజారు డచ్ రోడ్డులో వున్న ఆ సంస్థ కార్యాలయం ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశాఖ బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరిస్తారని, దాతలకు రూ. 2 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 : పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థిని మేడపాటి జెస్సీకి జమ్మి చెరువు వాకర్స్ క్లబ్ సభ్యుడు శేషాద్రి శనివారం రూ.పది వేలు ఆర్థిక సహాయం చేశారు. జమ్మిచెరువు వాకింగ్ ట్రాక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు ఎన్. జనార్దనరావు, శంకర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దాకమర్రిలో 'పల్లెకు పోదాం'

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 10 : దాకమర్రిలో బీజేపీ నాయకులు శనివారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్థులకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్** : శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లలిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్**: మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2** : సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు** : శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్** : శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం** : రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 18,టమాటా 24, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 24, క్యారేట్ 22, దొండకాయలు 34, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 14, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 32 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50,కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	117
ఫారం ధర	--	137
విత్ స్కిన్	--	244
స్కిన్‌లెస్	--	254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..



శిథిలమైన బెంచీ



తుప్పు పట్టి పాడైన కళామందిర్ రేకులు



పార్కులో మరమ్మతులతో ఉన్న ఆట వస్తువులు

అధ్వానంగా విశాలాక్షినగర్ రెవెన్యూ పార్కు

- ఏళ్ల తరబడి నిర్వహణ కరువు
- పాడైన ఆట వస్తువులతో చిన్నారులకు గాయాలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 10 : జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో ఉన్న రెవెన్యూ పార్కు నిర్వహణ లోపంతో అధ్వానంగా మారింది. పార్కు పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. పార్కు చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో పాములు, విష పురుగులు చేరుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సందర్శకులు భయపడుతున్నారు.

పాడైన ఆట వస్తువులు

పార్కులో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు తుక్కుపట్టి పాడయ్యే స్థితిలో ఉన్నాయి. దీంతో చిన్నారులు వాటిపై ఆటలు ఆడే సమయంలో గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా ఇనుప జారుడు బల్లలతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. అలానే ఫైబర్‌తో ఏర్పాటు చేసిన వస్తువులు ఎక్కడికక్కడ విరిగిపోయాయి.

గతంలో బెస్ట్ పార్కుగా గుర్తింపు

రెవెన్యూ అసోసియేషన్, జీవీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో కొన్నేళ్ల క్రితం ఈ పార్కును ఏర్పాటు చేశారు. పార్కులో అన్ని హంగులు సమకూర్చడంతో నగరంలోనే బెస్ట్ పార్కుగా గతంలో అవార్డు అందుకుంది. ప్రస్తుతం నిర్వహణ లోపంతో దయనీయ స్థితికి చేరింది. పార్కులో ఏర్పాటు చేసిన కళామందిర్‌లో ఏదైనా కార్యక్రమం చేసుకుందామన్నా పైన రేకులు తుప్పు పట్టి వర్షం పడితే నీరంతా లోనికి వచ్చేస్తోంది. విద్యుత్ లైట్ల స్తంభాలకు ఉండే బాక్స్‌లు తెరిచి ఉంటున్నాయి. దీంతో పార్కుకి వచ్చే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పించాలి



పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించి, ఆధునీకీకరించాలి. పాడైన ఆట వస్తువులతో చిన్నారులు గాయపడుతున్నారు. పార్కు గురించి కార్పొరేటర్ సహకారంతో మేయర్, ఎంపీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లాం.

\- సత్తి నాగేశ్వరరెడ్డి,
\- విశాలాక్షినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 : పట్టణంలోని నీడీ వెల్ఫేర్, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ది సన్ స్కూల్ ఆవరణలో శనివారం రక్తదాన, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. బీఎస్‌డబ్ల్యూ చైర్మన్ కైతపల్లి శ్రీనివాసరావు ఈ శిబిరాలను ప్రారంభించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 95 మంది రక్తదానం చేశారు. అలాగే శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 175 మందికి పరీక్షలు చేసి 48 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో బీఎన్‌డబ్ల్యూ సభ్యులు డాక్టర్ ఎన్ఎల్ రావు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ, ఎం. సూర్యశ్రీనివాస్, రమణప్రసాద్, సన్నీ కాళ్ల, డాక్టర్ ఆదిత్య, రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసరు కళ్యాణ్‌రామ్, అశోక్‌కుమార్, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యులు రత్నంరాజు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 10 : విద్యార్థులు చిన్నతనం నుంచే రహదారి భద్రతా నిబంధనల గురించి తెలుసుకోవాలని ప్రజా రవాణా శాఖ (పీటీడీ) వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్‌రావు అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆశీల్‌మెట్ట చైతన్య స్కూల్ విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు తప్పనిసరిగా వాహన రాకపోకలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీటీడీ వాల్తేరు డిపో అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల రాణి, చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణమూర్తి, పాఠశాల ఉపాధ్యా యులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైసీపీ పాలన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కొమ్మాది, ఫిబ్రవరి 10 : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైసీపీ పాలన సాగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన 5వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి హేమలత, వైసీపీ నాయకులు హనుమంతురావు, లక్ష్మణరావు, సోంబాబు, శ్రీనివాసరావు, జేఎస్ రెడ్డి, పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మాఘ మాసంలో ప్రత్యేక పూజలు

సింహాచలం, ఫిబ్రవరి 10 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెలలో పలు వార్షిక ఉత్సవాలు జరగనున్నాయి.11, 15, 18, 22, 29వ తేదీల్లో స్వర్ణ పుష్పార్చన, 14న కుంభ సంక్రమణం, శ్రీ పంచమి (సరస్వతి జన్మ నక్షత్రం), 16న సింహవల్లీ తాయర్ సన్నిధిలో సహస్రనామ కుంకుమార్చన, 16న రథసప్తమి, సూర్య జయంతి, 20న శుక్లపక్ష ఏకాదశి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించనున్నారు. అలాగే భీష్మ ఏకాదశి నాడు త్రిపురాంతకస్వామి, కొండదిగువ వేంకటేశ్వరస్వామి, మాధవధార వేణుగోపాల స్వామి వార్షిక తిరుకల్యాణోత్సవాలు, 21న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై రామాలయంలో సంక్షిప్త రామాయణ హవనం, 24న మాఘ పూర్ణిమ, భైరవ జయంతి నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మిక చైతన్యం అవసరం

- ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ



ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 10 : ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక చైతన్యం అవసరమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారులు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరు ఏబీసీ పార్కు ఆవరణలో బుధవారం నుంచి సామవేదం షణ్ముఖ శర్మ ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానం దేశమంతా వ్యాప్తి చెందిందన్నారు. అనంతరం కొడుకుల కృష్ణవేణి బృందం అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. జ్యోతిష్య నిపుణులు కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణా గాయత్రీ దంపతుల నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

700 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

రామ్‌నగర్, ఫిబ్రవరి 10 : జీవీఎంసీ 28వ వార్డు బానోజీనగర్‌లోని గెంజిపేటలో ఎన్‌టీఆర్ సేవా ట్రస్టు, గీతం ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో రామ్‌నగర్, జై సంతోషిమాత కాలనీ, ఊటగడ్డ, పితానిదిబ్బ ప్రాంతాలకు చెందిన 700 మందికి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు, ఉరుకూటు పైడిరాజు, సన్యాసిరావు, శ్రీనివాసరావు. డిల్లీశ్వరి, కనకమహాలక్ష్మి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వాసవీ మాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు

ఘనంగా వాసవీ మాత ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం, ఫిబ్రవరి 10 : మండలంలోని కృష్ణాపురంలో మహా గణపతి, మహాలక్ష్మి సమేత వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఏడో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు, 108 మంది మహిళలతో కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, తోమాల సేవ, పుణ్యాహవచనం, మండపారాధన, వాసవీ హోమం, లక్ష్మీగణపతి హోమం, రుద్రాభిషేకం. రుద్రహోమం చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవవిగ్రహాన్ని పల్లకీపై నిలిపి కోలాటం నడుమ, 102 కలశాలతో ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, మాజీ ఎంపీపీ కె. పద్మ, టీడీపీ నాయకుడు ఎర్నాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏ. శ్రీనివాసరావు, సత్యకృష్ణ, వెంకటనారాయణమూర్తి, సుందరరావు, శ్రీనివాసరావు, నరసింహమూర్తి, కోటేశ్వరరావు, బంగార్రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిబాబా ఆలయం వార్షికోత్సవాలు

ఆరిలోవ : చినగదిలిలోని నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నట్టు ఆలయ నిర్వాహకుడు వానపల్లి అప్పారావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి ఆలయ ఆవరణలో సామూహిక సాయి వ్రతాలు, పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. 13న ఉదయం బాబాకు అన్నాభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఉంటుందని చెప్పారు.

22వ వార్డులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10 : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ, మంగాపురం కాలనీలో వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నది ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

11 వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ, ఫిబ్రవరి 10 : జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్, శ్రీహరినగర్, అన్నానగర్‌లో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటి రూపాయల జీవీఎంసీ సాధారణ నిధులతో గాంధీనగర్‌లోని లక్ష్మీ కల్యాణ మండపానికి అదనపు భవన నిర్మాణం, శ్రీహరినగర్, అన్నానగర్ సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు ఇన్‌చార్జి గొలగాని శ్రీనివాసరావు. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



పీఆర్ఓ కార్యాలయం వద్ద రద్దీ

సింహాచలం, ఫిబ్రవరి 10 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. రెండు రోజులు వరుస సెలవులు కావడంతో ఉత్తరాంధ్ర నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే విధంగా రద్దీ కొనసాగింది. కేశఖండనశాల, గంగధార వద్ద, స్వామి దర్శనం అనంతరం లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయ కేంద్రాల రద్దీ ఎక్కువగా ఉండడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు.

భీమిలిలో వచ్చే నెల 16 నుంచి ఎల్లమ్మ తల్లి పండుగ

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 : పట్టణంలో వచ్చే నెల 16 నుంచి 18 వరకు ఎల్లమ్మతల్లి పండుగ జరగనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెరుపండా శేఖర్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల 5న ఉత్సవం చాటింపు, 16న తొలేళ్ల, 17న అనుపు ఉత్సవం జరుగుతుందన్నారు. అదే రోజు భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తామని, 18న అమ్మవారికి పసుపు, కుంకుమ పూజలు చేస్తామన్నారు.

పీవీకి భారతరత్న అవార్డు పట్ల హర్షం

సింహాచలం, ఫిబ్రవరి 10 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్రం భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల విశ్వహిందూ పరిషత్ మఠ్ మందిర్ టోలి పూడిపెద్ది శర్మ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా మోదీ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

పద్మనాభం (రూరల్) : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగువారికి ఎంతో గర్వకారణమని మాజీ మంత్రి అప్పలనరసింహారాజు అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ తన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించి వాటికి వన్నె తెచ్చారని చెప్పారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు.

ఈస్టు పాయింట్ కాలనీలో చిల్డ్రన్ పార్కు ప్రారంభం

పెదవాల్తేరు, ఫిబ్రవరి 10 : జీవీఎంసీ 20వ వార్డు ఈస్టు పాయింట్ కాలనీలో చిల్డ్రన్స్ పార్కును ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్ శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రూ. 5 లక్షల జీవీఎంసీ సాధారణ నిధులతో ఈ పార్కును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మువ్వల సురేష్, రవికిరణ్, రెడ్డి పాల్గొన్నారు. కాగా 21వ వార్డు కిర్లంపూడి లేఅవుట్, ఏయూ అవుట్ గేటు డౌన్ వద్ద జీవీఎంసీ నిధులు రూ 19.98 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఎంపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ రత్నాకర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ శ్రీనివాసరావు, మధుపాడ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 10 : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించరాదని, ఉద్యోగులకు నూతన వేతనాలను చెల్లించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్న తదితర డిమాండ్లతో ఈ నెల 16న చేపట్టనున్న కార్మిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కర్మాగారంలో కార్మిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సెయిల్‌లో మాదిరిగానే స్టీల్‌ప్లాంట్‌లో కూడా చెల్లింపులు జరిగేవని, కానీ ఇప్పుడు వాటిని యాజమాన్యం విస్మరించిందన్నారు.

స్థల పరిరక్షణకు వినతి

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 10 : తమ ఆధీనంలో 15 ఏళ్లుగా ఉన్న స్థలంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కొంతమంది నాయకులు చేస్తున్న ప్రయత్నాలను నివారించాలని ఎల్‌వీపాలెం గ్రామస్తులు భీమిలి ఆర్‌డీఓ వెంకటరెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబరు 276లో ఉన్న 15 ఎకరాల కొండ పోరంబోకు భూమిలో 40 మంది కొన్నేళ్లుగా మొక్కలు పెంచుతున్నారు. కానీ పరిసర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో ఈ స్థలంలో కూడా ఇళ్లు నిర్మించాలన్న ఆలోచనలో కొంతమంది నాయకులు ఉన్నారని చెప్పారు. ఇప్పటికే స్థలాన్ని చదును చేసి గ్రావెల్ తరలించడంతో పాటు వేసిన మొక్కలను తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు.

98 వార్డులో రూ.115.2 లక్షలతో పనులు

సింహాచలం, ఫిబ్రవరి 10 : జీవీఎంసీ 98వ వార్డులో రూ.115.2 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ప్రియా గార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్‌ను రూ. 15.5 లక్షలతో, ఎన్‌జీఓస్ కాలనీలో బీటీ రోడ్డు, రూ.18.8 లక్షలతో, నరసింహనగర్‌లో బీటీ రోడ్డు, రూ. 12.8 లక్షలతో, కాపువీధిలో సీసీ రోడ్లు రూ.19.96లక్షలతో, గోశాల నిర్వాసితుల కాలనీలో రూ.18.12 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు చెప్పారు.

త్వరలో సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 10 : మెగా డీఎస్సీ పేరుతో ముఖ్యమంత్రి జగన్ నిరుద్యోగులను దగా చేయడంతో త్వరలోనే సీఎం క్యాంప్ కార్యాలయాన్ని నిరుద్యోగులతో కలిసి ముట్టడిస్తామని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 23 వేలు టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ 6100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. మంత్రి బొత్స కల్లబొల్లి మాటలను నమ్మే స్థితిలో నిరుద్యోగులు లేరని చెప్పారు.

'ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి'

కొమ్మాది, ఫిబ్రవరి 10 : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు కేంద్రం భారతరత్న ప్రకటించాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ బీసీ సెల్ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి నమ్మి శ్రీను,రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి వారు విలేకరులతో మాట్లాడారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని, రాజకీయ కారణాలతో ఆయనకు భారతరత్న ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 : చేపలుప్పాడకు చెందిన గాలి రమాదేవి (32) శుక్రవారం నుంచి తన ఇద్దరు పిల్లలతో సహా కనిపించడం లేదని ఆమె భర్త నరసింగరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమాదేవి ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతుందని, ఈమేరకు గ్రామంలోని తుఫాన్ రక్షిత భవనంలో జరుగుతున్న తరగతులకు ప్రతిరోజూ వెళ్తుతుందన్నారు. శుక్రవారం తనతో పాటు పిల్లలను కూడా తీసుకువెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.